ఆటో కార్మికుడు మృతి

విశాలాంధ్ర - మందస : మందసకు చెందిన ఆటో డ్రైవరు గుడియా సంతోష్ (25)గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆటో డ్రైవరు సంతోష్ మందస నుంచి భీపీ, బుడార్సింగి వరకు ప్రయాణికుల ఆటో నడువుతుంటారు. మంగళవారం అర్ధరాత్రి హఠత్తుగా గుండె పోటు రావడంతో అక్కడి కక్కడే కుప్పకూలి పోయారు.ఆటో డ్రైవరు మృతి చెందడంతో సహచర ఆటో కార్మికుల్లోను, కుటుంబం బంధు వర్గాలలో విషాద చాయలు నెలకొన్నాయి. సంతోష్ మృతి పట్ల సంతాపం తెలుపుతూ బుధవారం స్థానిక మహేంద్ర ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన చీపి, దేవుపురం, హరిపురం, సొండిపూడి రూటుల్లో తిరుగుతున్న ఆటోలను స్వచ్ఛందంగా బంద్ చేసారు. కుటుంబ సభ్యులకు మహేంద్ర ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు,నాయకులు, ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు.

పదో తరగతి విద్యార్ధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర - మందస : పదవ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుడు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటీడీఏ పీవో సి. యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలం చీపి ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మరుగు దొడ్లను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యా యులతో సమావేశం నిర్వహించి ఇటీవల నిర్వహించిన ప్రీ ఫైనల్ పరీక్షల యొక్క జవాబు పత్రాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సల హాలు, సూచనలు అందించారు. బోధనను మరింత మెరుగుపరుచుకోవాలని ఉపాధ్యా యులకు సూచించారు. వసతి గృహ గదులు శు

భ్రంగా లేవని, ప్రతిరోజు శుభ్రం చేయాలని సూచించారు. మండలం సిరిపురం పీహెచ్ సీని ఐటీడీఏ పీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్ సీలో ఓపీ రికార్డులు, రక్త పరీక్షల ల్యాబ్ ను పరిశీలించారు. ప్రసవాలకు సంబంధించిన క్యాలెండర్ ను పరిశీలించి, పీహెచ్ సీలో ప్రసవాల సంఖ్యను పెంచాలని అన్నారు. అదే విధంగా పిహెచ్ సీలో ప్రహరీ గోడ సమస్యను పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు.అనంతరం చిన్న కోస్టా ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని అన్నారు. ఉపాధ్యా యులతో మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో ఫ్యాన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలకు డ్రైనేజీ కాలువ మంజూరు చేయుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎంలు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పత్రి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఎం ఎస్ ఎంఈ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పత్రి అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో యూనియన్ బ్యాంక్ రీజియన్ ఆధ్వర్యంలో మెగా ఎం ఎస్ ఎం అవుట్ రీచ్ క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు లోన్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎమ్మెస్ ఎంఈ రుణాల ద్వారా దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 3 నుంచి 7 వరకు ఎమ్మెస్ అని రుణమేల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈరోజు ఎం ఎస్ ఎం ఈ ద్వారా పది కోట్ల రుణాలు చెల్లించమని 16 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. దేశంలోనే అత్యధిక లావాదేవీలు నిర్వహిస్తున్న ఐదవ అతిపెద్ద బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ ఉందని చెప్పారు. లబ్ధిదారులు సివిల్ సక్రమంగా సరిచూసుకోవాలన్నారు. వ్యాపారులు లోన్ ద్వారా పొందిన నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టకుండా వ్యాపార క్రమశిక్షణను పాటించాలని సూచించారు. గత ఐదేళ్లలో మహిళా

వ్యాపారులు మూడు రెట్లు పెరిగారని, వారికి రుణాలు అందజేసి మహిళా అభ్యున్నతికి, వారి ఆర్థిక అభివృద్ధికి యూనియన్ బ్యాంక్ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. సువిధ, నారీశక్తి తదితర పథకాల ద్వారా మహిళలకు రుణాలు అందజేయడమే కాకుండా వారు మరి కొంతమందికి ఉపాధి కల్పించి దేశాభివృద్ధికి తోడ్పడేలా అన్ని విధాల సహకరిస్తున్నట్టు జీఎం వివరించారు. యువత బ్యాంకుల్లో సిబ్బందిని కలవకపోవడం వల్లే రుణాల పట్ల అవగాహన ఉండడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ, జీఎం విజయరత్నం, పీయూష్ సింగ్, ఎం వెంకట తిలక్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఋణము తీర్చుకున్న పూర్వ విద్యార్థి నరేష్

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం దండు గోపాల పురము జిల్లా పరిషత్ హై సల్లో 2009లో 10 వతరగతి చదివిన పూర్వ విద్యార్థి ఇచ్ఛాపురం నరేష్ (ప్రస్తుతము బెంగళూరులో ప్రముఖ సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్). తను చదివిన పాఠశాలకు ఏదయినా సహాయ పడి బడిఋణము తీర్చుకుందామనే ఆలోచనతో రానున్న వేసవిలో త్రాగునీటికి విధ్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండటానికి సుమారు 25000 రూపాయలతో ప్రతి తరగతికి పైపులైన్లు వేయించి తరగతి గది వద్దనే మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా పాటశాల ప్రదానోపాధ్యాయులు. చైతన్య మాట్లాడుతూ, పూర్వ విద్యార్థి నరేష్ చేసిన సహాయము ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. పాటశాల పూర్వ విద్యార్థులలో సరిక్రొత్త ఆలోచనలు రేకెత్తిస్తుందని, ఇటువంటి కార్యక్రమాలు అరుదుగా జరుగుతుంటాయని పాఠశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థులు తాము చదివిన పాఠశాలకు వసతులు సమకూర్చి బడిఋణము తీర్చుకుందాము అనే ఒక గొప్ప సంస్కృతికి నాంది పలికారని, ఇది మిగతా విద్యార్థులు ఆదర్శంగాను, స్ఫూర్తిగాను తీసుకోవాలని అన్నారు. నరేష్ తన ఉద్యోగ జీవితములో కూడా బాగా రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఇందుకు సహకరించిన తల్లితండ్రులకు, మిత్రులకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తరపున కృతజ్ఞతలు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో వాయుపుత్ర యూత్ అధ్యక్షులు అట్టాడ.ప్రసాద్, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్ర రావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, రాము, ఉమ, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, శ్రీనివాసరావు, దయాసాగర్ పాల్గొన్నారు.

మెజీషియన్ కుటుంబానికి రూ.72,600 అందించిన జిల్లా కళాకారులు

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణానికి చెందిన కళాకారుడు, మెజీషియన్, కళాకారుడు అయిన పండిట్ సత్యన్నారాయణ కుటుంబానికి శ్రీకాకుళం జిల్లా కళాకారుల సంఘం, ఈవెంట్స్ మేనేజర్లు రూ.72,600 ఆర్థిక సహాయాన్ని బుధవారం అందచేశారు. ఇటీవల కాలంలో పండిట్ సత్యన్నారాయణ గుండెపోటుతో మరణించిన కారణంగా మృతుడు కుటుంబానికి ఆర్థిక సహాయమందించారు. ఈ సంధర్భంగా మృతుడు కుటుంబ సభ్యులు విశాలాంధ్రతో మాట్లాడుతూ ఒక కళాకారుడు కోసం జిల్లా కళాకారుల సంఘం, ఈవెంట్ మేనేజర్లు స్పందించి, ఆర్థిక సహాయమందించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్లు, శ్రీకాకుళం జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు హాజరుకావాలి

సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ

విశాలాంధ్ర - పొందూరు : ఈ నెల 07 తేదీన అనగా శుక్రవారం విద్యుత్ వినియోగదారులకు సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సిజిఆర్ఎఫ్ సభ్యులు తెలిపారు.ఏపీ ఈపీడీసీఎల్ శ్రీకాకుళం డివిజన్ పరిధిలో పొందూరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయములో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార వేదిక ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించబడును. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశమును వినియోగించుకొని తమ సమస్యలు పరిష్కారం కోరకు జి సిగాడం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం, పైడిభీమవరం ఏపీ ఈపీడిసీఎల్ సెక్షన్ల పరిధిలో గల వినియోగదారులు తమ యొక్క సమస్యలు పరిష్కరించుకోగలరని తెలిపారు. ఈ సమావేశమునకు సి.జి.ఆర్.ఎఫ్. ఛైర్పర్సన్ డా. బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు శ్రీమతి బి.సులేఖరాణి, అకౌంటెంట్ సభ్యులు షేక్ బాబర్ హాజరవుతారని సి.జి.ఆర్.ఎఫ్ కార్యదర్శి తెలియచేశారు.

నరసన్న చెరువు గర్భాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు

'విశాలాంధ్ర'కు స్పందన

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో ఆర్.టి.సి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న నరసన్న చెరువును రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈనెల 5వ తేదీన విశాలాంధ్ర దినపత్రికలో 'ఆక్రమణలకు గురౌతున్న నరసన్న చెరువు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు తహశీల్దార్, టి.సత్యన్నారాయణ స్పందించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను చెరువులో వేసిన ఇంటి వ్యర్థాలను పరిశీలించమని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ విఆర్వో, శ్యామ్‌కుమార్ చెరువు గర్భంలో చదును చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో ఇంటి వ్యర్థాలను వేసిన కాకర్ల అప్పమ్మతో మాట్లా డుతూ చెరువు గర్భంలో ఇంటికి చెందిన వ్యర్థాలను వేయరాదని, అలాగే చెరువు గర్భాలను ఆక్రమించు కోరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు, రామచంద్రరావు, గణేష్ పాల్గొన్నారు.

గీత కార్మికుల మద్యం దుకాణాలకు నేడు లాటరీ

విశాలాంధ్ర - సోంపేట : కల్లుగీత, అలాగే సొండి కులస్తులకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాల కొరకు గురువారం శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ నిర్వ హిస్తున్నట్లు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బేబీ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు జరగనున్న లాటరీ కార్యక్రమానికి ధరఖాస్తు దారులు ఆధార్, నేటివ్, కుల, ఉపకుల ధృవీకరణ పత్రాలతో పాటుఎంట్రీ పాస్‌లను తీసుకుని హాజరవ్వాలని కోరారు.

మందసలో ఐటీడీఏను ఏర్పాటు చెయ్యాలి

ఆదివాసీ వికాస్ పరిషత్ అధ్యక్షులు జగన్

విశాలాంధ్ర - మందస : పలాస నియోజవర్గంలో గల పలాస, మందస మండలాల పరిధిలో అధిక శాతం గిరిజనుల నివసిస్తున్నారని వారి అభివృద్ధి కోసం మందసలో ఐటిడిఏ ఏర్పాటు చేయాలని ఆదివాసి వికాస్ పరిషత్ అధ్యక్షులు జగన్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ గత ఎన్నికల ప్రచారంలో పలాస ఎమ్మెల్యే శిరీష, జిల్లా ఎంపీ రామ్మోహ నాయుడులు మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారని ఆ హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఐటీడీఏ ఏర్పాటుకు మందసలో వైటిసి భవనాలు, ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటితో పాటు ఐటీడీఏ ఉప కార్యాలయాలు కూడా ఉన్నాయని ఇక్కడ ఏర్పాటు చేస్తే భవనం నిర్మాణం కొరకు ఆర్థిక భారం కూడా ప్రభుత్వానికి తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మందసలో ఐటీడీఏ ఏర్పాటుకు దృష్టి సారించాలని ఆయన కోరారు.

ధాన్యం ఎప్పుడు కొంటారు

ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర - కవిటి : వ్యవసాయశాఖ మంత్రి సొంత జిల్లా అయిన శ్రీకాకుళంలో పలు గ్రామాల్లో రైతుల వద్ద లక్షన్నర టన్నులకు పైగా ధాన్యం నిల్వలు వారి ఇళ్లలు, కల్లాల్లో ఉన్నాయి. వాటిని ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్సీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన శాసన మండలిలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం సగంలోనే చేతులెత్తేసిందని ఎద్దేవ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో పలు మండలాల్లో ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ధాన్యం కొనుగోలు చేసి తక్షణమే వారి బాధలను తొలగించాలని శాసన మండలిలో తెలిపారు.

ఎమ్మెల్సీ గాదెకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - సోంపేట : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడుకు పిఆర్‌టియు ఉపాధ్యాయులు సోంపేటలో మంగళవారం రాత్రి స్వాగతం పలికారు. విజయం సాధించిన మొట్ట మొదటిసారిగా సోంపేటకు విచ్చేసిన ఆయనకు ఉపాధ్యాయవర్గాలు ఆనందోత్సాహాలనడుమ బాణాసంచా కాల్పులతో ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. దుశ్శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి తమ విజయోత్సహాన్ని పంచుకున్నారు. అనంతరం ఒడిశా సరిహద్దులో గల సిద్ధభైరవి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ప్రతినిధులు దుద్ది బాలరాజు, నగిరి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ప్రతినిధి, డి.వేణుగోపాలరావు తనిఖీ చేశారు. విద్యార్థులు ఇంటర్మీ డియట్ పరీక్షలు రాస్తుండగా పరీక్ష గదులకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. స్లిప్పులు చూసి పరీక్షలు రాయకూడదని ఆయన విద్యార్థులకు సూచించారు. ఆయనతో పాటు నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళా సాధికారతే అసలైన అభివృద్ధి : డీఎస్పీ వివేకానంద

ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - రణస్థలం : మహిళా సాధికారతే అసలైన అభివృద్ధి అని శ్రీకాకుళం ఎస్. డీ.పీ.ఓ.సి.హెచ్ వివేకానంద అన్నారు. మండలకేంద్రం జె.ఆర్.పురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం .అవతారం ఆధ్వర్యంలో సర్కిల్ పరిధి నాలుగు మండలాల పోలీస్ మహిళా సిబ్బందికి బుధవారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రణస్థలం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పి వివేకానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాకుండా మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. అవకాశాలని అందిపుచ్చుకొని తమ కుటుంబంతో పాటు సమాజంలోనూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. అన్ని రంగాలతో పాటు పోలీస్ శాఖలో కూడా మహిళలు అధికంగా సేవలందించడం సంతోషదాయకం అని ప్రశంసించారు. జె.ఆర్.పురం సి.ఐ అవతారం మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాలు వివరించారు. స్వీయ రక్షణ పెంపొందించుకోవటానికి తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇటువంటి ఆత్మీయ సమ్మేళ నాలు, ప్రత్యేక దినోత్సవాలు జరపడం వల్ల ఒత్తిడి తగ్గి మానసికోల్లాసం పెంపొందుతుంది అన్నారు. క్షేత్రస్థాయిలో మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార మార్గాలను సూచించారు. ప్రత్యేక ప్రతిభ కనబరిచిన జి.ఎం.ఎస్.కె.లకు మూడు నెలలకు ఒకసారి ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల ఎస్సైలు ఎస్.చిరంజీవి, సంపత్ కుమార్, మధుసూదనరావు, ఎంపీడీవోలు ఈశ్వరరావు, పి.వెంకట్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మహిళలందరకు జ్ఞాపికలు అందజేశారు.

క్లీన్ క్యాంపస్ - గ్రీన్ క్యాంపస్ ట్రిపుల్ ఐటీ

శ్రీకాకుళంలో మెగా క్లీనింగ్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛ క్యాంపస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, ఏవో శ్రీ. ముని రామకృష్ణ పర్యవేక్షణలో క్యాంపస్ లో ఉన్న నాగావళి, వంశధార, చంపావతి, వేగావతి, సువర్ణముఖి, మహేంద్రతనయ, అక్షయ మొదలైన తరగతి గదుల భవన సముదాయం చుట్టూ వాలంటీర్లు ప్లాస్టిక్ మరియు పేపర్ ను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం వసతి గృహాల చుట్టూ ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. డైరెక్టర్ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మొదలైన వాటిపై పిల్లల్లో అవగాహన కలిగి సామాజిక బాధ్యతతో భవిష్యత్తు తరాలను స్వచ్ఛత వైపు నడిపించటమే ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఏవో శ్రీ. ముని రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సూచనల మేరకు స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా ఆరోగ్యం, పరిశుభ్రత పాటించాలని చెబుతూ ఇందులో భాగంగా అనేక కార్యక్రమాలు నిర్వహించదలచాము అన్నారు. డీన్ మోహన్ కృష్ణ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో సేవా కార్యక్రమాల్లో ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కో - ఆర్డినేటర్ డా. పెద్దింటి ముకుందరావు ప్రోగ్రాం ఆఫీసర్లు డా.వి. సింహాచలం, డా.జి.ఈశ్వరరావు, డి.సింధూజ, ఆర్.పద్మావతి, టి.అసిరినాయుడు డా.బి.శ్రీధర్, పీఆర్వో. మామిడి షణ్ముఖ మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.

అధ్యక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మంజూరు చేయరూ..

ఎమ్మెల్యే గోవిందరావు

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : రాష్ట్రంలోనే పాతపట్నం నియోజకవర్గం భౌగోళికంగానూ, అభివృద్ధిలోనూ అత్యంత వెనుకబాటుకు గురికావడం తోపాటు ఇక్కడ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం మరియు వ్యవసాయమే ఆధారంచేసుకున్న నియోజకవర్గం కావడంతో అత్యవసర పరిస్థితుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే స్థోమత ప్రజలకు లేదు అధ్యక్షకనుక తమ ద్వారా సంబంధిత మంత్రికి మా నియోజకవర్గంలో అన్ని సదుపాయాలతో కూడిన వంద పడకల గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేయాలని స్పీకర్‌ని పాతపట్నం నియోజక వర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు బుధవారం అసెంబ్లీలో తెలియజేశారు.

ఐటీ విభాగపు అధ్యక్షుడిగా బత్తిని లక్ష్మణ్

విశాలాంధ్ర - మందస : మండలం బేతాళపురం గ్రామానికి చెందిన బత్తిని లక్ష్మణ్ పలాస నియోజకవర్గం ఐటి విభాగపు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వైస్సార్ పార్టీ అధ్యక్షులు శ్రీ.వై.యస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి డా.అప్పలరాజు సిఫార్సులతో పలాస నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడుగా నన్ను నియమించనందుకు చాలా గర్వ పడుతున్నానని,నాపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించినందుకు తన వంతు బాధ్యతగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని లక్ష్మణ్ అన్నారు. బత్తిని లక్ష్మణ్ డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ బోర్డ్ మెంబెర్ గా కొనసాగుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

రక్త దానం చేసిన 35 మంది విద్యార్థులు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 35మంది విద్యార్థులు 35 యూనిట్ల రక్తాన్ని జిల్లా రిమ్స్ ఆసుపత్రి సిబ్బందికి అందచేశారు. అనంతరం కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్, శాంతిహేమ్ మాట్లాడుతూ రక్తదాత-ప్రాణదాత అని, అత్యవసర సమయాల్లో ఆపదలో ఉన్న రోగులకు రక్తం అందచేసి, వారి ప్రాణాలకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్ అధికారులు, ఢిల్లీశ్వరరావు, నాగరాజు మాట్లాడుతూ రక్తదానం వల్ల యువతలో రక్త సరఫరాలో నిలకడను, మనిషి అందాన్ని పెంచుతాయన్నారు. ఎన్‌సిసి అధికారి, డా.జి.రవికుమార్ మాట్లాడుతూ రక్తదానంపై నేటి యువతకు అపోహలు ఉండటం వలన రక్తదానం చేసేందుకు ముందుకు రావటం లేదన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో టి.బి వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌సి కో-ఆర్డినేటర్, డా.పూజాభరద్వాజ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సభ్యులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - టెక్కలి : ఇటీవల శ్రీకాకుళం జిల్లా నుండి నలుగురు సభ్యులు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ కు ఎన్నికైన సందర్భంగా టెక్కలిలో స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా టెక్కలి ప్రెస్ క్లబ్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగాలు అర్బన్ సీఐ అంబటి విజయ్ కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డివి వివేకానంద, రాష్ట్ర సామ్నా అధ్యక్షులు మరియు ఐజేయూ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల కంటే జర్నలిస్టులు అధికంగా ఇన్వెస్టిగేషన్ చేస్తారని అన్నారు. ప్రతి రిపోర్టర్లు తప్పనిసరిగా జరిగిన సంఘటనలు వివరాలను అధికారులకు అడిగి వాస్తవ వార్తలు రాస్తే ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించవచ్చని అన్నారు. అలాగే ప్రతి ఒక్క జర్నలిస్టు కూడా కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి సమస్యనైనా నేలదొక్కొచ్చని అన్నారు. డివి వివేకానంద మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టులు కలిసికట్టుగా పనిచేస్తే ఇలాంటి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మరియు ఉన్నత స్థాయికి వెళ్లే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. సామాజిక ప్రగతిలో మీడియా పాత్ర చాలా కీలకమని ప్రశంసించారు. జర్నలిస్టుల పట్ల కక్ష సాధింపుతో ఎవరైనా వ్యవహరిస్తే న్యాయ సహాయానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఎంతో గౌరవం కలిగిన టెక్కలి ప్రెస్ క్లబ్ భవనం నిర్మాణానికి తమ శాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం నల్లి ధర్మారావు మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛ అంటే, యాజమాన్యాల స్వేచ్ఛ కాదని, రాజ్యాంగ పరిధిలో భావ ప్రకటన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగానికి, చట్టాలకు ఎవరూ అతీతులు కాదని చెబుతూ ప్రజాస్వామ్యం పరిరక్షణలో మీడియా పాత్రను మిగిలిన వ్యవస్థలో గౌరవించాలని కోరారు. మీడియాకు వన్నె తెచ్చే వృత్తి విలువలే అని కొనియాడారు. అనంతరం ఇటీవలే ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్కు ఎన్నికైన బెండి నర్సింగరావు, గుడిమెట్ల శ్రీనివాసరావు, కొంచాడా రవిశంకర్, ఎంవి మల్లేశ్వరరావు లను దుస్సాలువతో ఘనంగా సత్కరించి, టెక్కలి ప్రెస్ క్లబ్ జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ ఈశ్వరరావు, విశాలాంధ్ర విశాఖపట్నం బ్రాంచ్ మేనేజర్ సనపాల నరసింహులు, యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ జగదీష్, కార్యదర్శి సనపల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, కార్యదర్శి వాసు, సామ్నా జిల్లా అధ్యక్షులు చిన్నారావు, కార్యదర్శి నవ చైతన్య, టెక్కలి ప్రెస్ క్లబ్ సభ్యులు, ఇతర మండలాల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతి కార్యాలయం, నరసన్నపేట

టెండరు నోటీసు

రేఖా నెం.66/2025-బి

తే:05-03-2025ది

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం, నరసన్నపేట గ్రామ పంచాయతి నందుదిగువ సుదహరించిన షెడ్యులు-1 నందు చూపబడిన పనులను 2025-2026 (తే:01-04-2025ది నుండి తే:31-03- 2026ది వరకు) కాంట్రాక్టు పద్ధతి పై పనులు చేయుటకు టెండరు దాఖలు చేయువారు టెండరు ధరావత్తు చెల్లించి తే:12-03-2025ది ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.1-00 వరకు గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును.స్వీకరించబడిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.3-00లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలోతెరవబడును మరియు షెడ్యుల్ టెండరుదారులు టెండర్ షరతులకు లోబడి పాల్గొనవలెను.

షెడ్యులు-1(టెండరు)

వ.నెం	పని /సామాగ్రి వివరములు	పోస్టుల సంఖ్య	చెల్లించవలసిన టెండర్ ధరావత్తు
1)	PWS గ్యాంగ్ మజ్దూర్లు-2	01	రూ.500/-
2)	PWS పంప్ హౌస్ వాచ్ మెన్-4	01	రూ.500/-
3)	PWS పంప్ హౌస్ ఆపరేటర్ పనులు (దేవాది)	01	రూ.500/-

షరతులు :- G.O.MS.No.57 PR &RD (Esst.III) Department Dated :13-02-2019లో నిబంధనలకు లోబడి గరిష్ఠ వేతనము రూ.10000/- మించకుండా టెండరు దాఖలు చేయవలెను మరియు గత సంవత్సరము/ప్రస్తుత సంవత్సరములో పని చేయు సిబ్బంది గరిష్ఠ వేతనముకంటే మించి కాంట్రాక్టు వేతనము ఉన్నట్లయిన సదరు మొత్తమునకు మించకుండా టెండరు దాఖలు చేయవలెను మరియు గ్రామ పంచాయతిలో ఇదివరలో పనిచేసిన అనుభవం కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత కల్పించబడును.

టెండర్లు ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిద వేయుట గాని, తిరస్కరించుటగాని, పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతికి, అందులకు సంబంధించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు, ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను.

// సం.// పల్లి బ్రాహ్మయజీ
కార్యనిర్వహణాధికారి
(పంచాయతి కార్యదర్శి)
గ్రామ పంచాయతి, నరసన్నపేట

ముఖ్యమంత్రిని కలిసిన ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు

విశాలాంధ్ర - పొందూరు : ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఉండవల్లి నివాసంలో సీఎంను గురువారం మర్యాద పూర్వకంగా కలిశి తన విజయానికి అన్ని విధాలా సహకరించినందుకు సీఎంకు, కూటమికి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును సీఎం అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారిని అన్ని వేళలా గౌరవిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీల రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్ బాలజీ, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు ఏజీఎస్ గణపతి రావు, ఎస్టీయు విశాఖ జిల్లాకార్యదర్శి ఇ.పైడి రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.సదాశివరావు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, గుంటూరు జిల్లా పీఆర్టీయు అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కవిటి : రబీలో రాగి, వరి పంటలో అగ్గి తెగులు ఆశిస్తుందని వాటిని తక్షణమే నివారణ చర్యలు రైతులు చేపట్టాలని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రామ్మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఏవో బి.దుర్గాప్రసాద్ తో కలిసి బట్టివానిపాలెం, బోరివంక గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో పంట పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రాగి, వరి పంటలలో అగ్గి తెగులు, కాండం తొలిసే పురుగే తీవ్రతను గుర్తించడం జరిగింది. వాటి నివారణకు కార్బన్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి, మరియు ట్రై సైక్లోజెల్ 0.7 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే ఎరువుల ఎకరానికి 25 కిలోల యూరియా, పొటాష్ 15 కిలోలు నుంచి 20 కిలోలు వరకు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బెండాళం శ్రీకళ్యాణ్, రైతులు బడే అప్పన్న, సురేష్ పాల్గొన్నారు.

మాతృమూర్తి సంఘం సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - కవిటి : ఉద్దానం ప్రాంతంలో గత 15 ఏళ్లుగా నిరుపేదలకు సేవలు అందిస్తున్న కుసుంపురం గ్రామానికి చెందన మాతృమూర్తి యువజన సంఘం సేవలు ప్రశంసనీయమని బల్లిపుట్టుగ సర్పంచ్ రజనీ కుమార్ దొలాయి అన్నారు. ఇటీవల "దాతలు సహకరిస్తే బతుకుతాం" విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురించిన కథనానికి కుసుం పురం మాతృమూర్తి యువజన సంఘం స్పందించారు. బల్లిపుట్టుగ గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న సావిత్రి దొలాయి, సోంపేట సామాజిక ఆసుపత్రిలో కుమారుడికి డయాలసిస్ జరుగుతుంది. నిరుపేద కుటుంబం కావడంతో తక్షణ సహాయంగా బుధవారం రూ.8 వేలు ఆర్థిక సహా యంను అందజేశారు. మరింత మంది దాతలు,స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని మాతృమూర్తి యువజన సంఘ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు, బల్లిపుట్టుగ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి నైపుణ్య కోర్సుల్లో ప్రవేశాలు

విశాలాంధ్ర - పలాస : పలాస డాక్టర్.వి.కణితీష్ ప్రభుత్వ ఐటిఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో(ఏపీ ఎస్ ఎస్ డి సి) స్వల్ప కాలిక కోర్సు లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, వెల్డింగ్ మరియు సిసి టివి టెక్నీషియన్ కోర్స్ లను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పైల జవహర్, జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ లు బుధవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత లేదా ఆ పైన పాసైన విద్యార్హత కలిగి 18-30 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికేట్స్, పాస్ పోర్ట్ ఫోటో మరియు ఆధార్ జెరాక్స్ లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం హబ్ కో ఆర్డినేటర్ 6301046329 నంబర్ కు సంప్రదించాలని సూచించారు.

క్రిమినల్ కేసులను తక్షణమే రాజీ చేయాలి

న్యాయ మూర్తి బీఎంఆర్ ప్రసన్నలత

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ నెల 8వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్లో ఉన్న రాజీపడదగ్గ అన్ని క్రిమినల్ కేసులను తక్షణమే రాజీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు కోటబొమ్మాళి ఫస్ట క్లాస్ న్యాయమూర్తి జీఎంఆర్ వప్రసన్నలత ఆదేశించారు. స్థానిక కోర్టులో పోలీసు, బ్యాంకు అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏదైనా కేసులలో పార్టీలు రాజీకి ముందుకు వచ్చినప్పుడు వారికి లోకదాలత్ ప్రయోజనాలు వివరించాలని, రాజీ చేసుకుంటే వారి ఆదాయము, సమయము కూడా ఆదా అవుతాయని రాజీమార్గమే రాజమార్గమని , పోలీసు సిబ్బంది అందరూ ముందుగానే చర్చలు జరిపి కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ చేయాలని కోరారు. అదేవిధంగా బ్యాంక్ అధికారులకు కోర్టులో పెండింగ్లో ఉన్న బ్యాంకులకు సంబంధించిన రికవరీ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు, ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నా తక్షణమే వారందరికీ మండల న్యాయ సేవా సంఘం ద్వారా నోటీసులను అందిస్తామన్నరు. వారందరూ వన్ టైం సెటిల్మెంట్ లేదా వారికి లోన్ రికవరీ కేసుల్లో బ్యాంకు వారు అవకాశం ఇచ్చి వడ్డీ మినహాయింపులు లేదా ఏవైనా పథకాల అమల్లో ఉన్నా, వాటిని అమలు జరిపి అటువంటి కేసులను కూడా రాజీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని న్యాయమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జె. శ్రీనివాస రావు, సంతబొమ్మాలి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై. .సింహాచలం, కోటబొమ్మాళి సబ్ ఇన్స్పెక్టర్ ఎల్లయ్య, జలుమూరు ఎస్సై బి .అశోక్ బాబు, నౌపడ హెచ్. సి. వి. భీమారావు, బ్యాంకు మేనేజర్లు వి. ప్రవీణ్ కుమార్, రవిచంద్ర ప్రసాద్, ప్రకాష్ కుమార్, కోర్ట్ కానిస్టేబుల్స్ బాలకృష్ణ, వెంకట్రావు, ఎర్రన్న, అశోక్, ఎక్సైజ్ కానిస్టేబుల్ కాంతారావు పాల్గొన్నారు.

ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశ్నాపత్రంలో లోపాలు..!

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవి

విశాలాంధ్ర - పలాస : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బుధవారం నాడు జరిగిన పరీక్ష పత్రంలో ప్రశ్న సంఖ్య 8 మరియు13 ఒక్కొక్క ప్రశ్నకు 5ం5 = 10 మార్కుల ప్రశ్నలు కనిపించే పరిస్థితి లేవని, ప్రశ్నపత్రంలో లోపాలు ఉన్నాయని ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. కాశీబుగ్గలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్ష ప్రారంభం అయిన 25 నిమిషాలకు తరువాత తప్పు జరిగింది సరి చేసుకోమని ప్రశాంతంగా పరీక్ష రాస్తున్న విద్యార్థులను సుమారు 10 నిమిషాలు... పాటు అంతరాయం కలిగించి.....కనిపించని అంశాలు కొన్ని సెంటర్లలో రాసుకొమని... బ్లాక్ బోర్డుపై మరికొన్ని సెంటర్లో వ్రాశారని తెలిపారు.విద్యార్థులు నష్టపోయిన సమయం తిరిగి కేటాయించలేదని ... అంటే పరీక్ష సమయం పెంచకపోవడం విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగే పరిస్థితులను విద్యార్థులలో ఆందోళన ఒత్తిడి కి కారణమైందన్నారు. ముందుగా మూడు సెట్ల పేపర్లను.. సరి చూడవలసిన... బాధ్యతగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఫలితమే బాగా చదివే విద్యార్థులు నష్టపోయిన పరిస్థితి ఏర్పడిందని., దీనిపై సమగ్ర విచారణ జరపాలని కారణమైన బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల పక్షాన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్. చేస్తుందని అన్నారు.

ఎస్ఎస్ఏ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

విశాలాంధ్ర - టెక్కలి : రాష్ట్ర జేఏసీ కమిటీ నిర్ణయం మేరకు మండల కేంద్రంలో ఎంఆర్సి పరిధిలో గల సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ సిబ్బంది బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ పాలసీ, ఎంటిఎస్, సమ్మె కాలపు ఒప్పందాలు, గ్రాట్యూటీ, పదవి విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు, ఇతర సమస్యల పై మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష సిబ్బంది ప్లకార్డులతో నినాదాలతో వారి భావోద్వేగాలను నిరసనగా తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో చక్రధర స్వామివారి ఊరేగింపు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగలో వెలసివున్న శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ స్వామివారి డోలోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాలుగవ రోజు కార్యక్రమాన్ని పిరియా వీధి కి చెందిన పిరియా జగ్గారావు, నారాయణమూర్తి ఆర్థిక సహకారంతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం పల్లకిలో స్వామి వారిని ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పొందల కృష్ణారావు, పొందల రాంబాబు, పొందల విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు పెళ్లి పత్రిక అందించిన ఎం.ఆర్

విశాలాంధ్ర - ఆమదాలవలస : తన కుమారుడు వివాహానికి హాజరు కావాలని కోరు తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కు టిడిపి సీనియర్ నాయకుడు జిల్లా కార్యాలయ కార్యనిర్వాహక కార్య దర్శి మొదలవలస రమేష్ సోమవారం ముఖ్యమంత్రిని అమరావతిలో గల చంద్రబాబు నివాసంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ కలిసి పెళ్లి పత్రిక అందజేశారు. మొదలవలస రమేష్ కుమారుడు చంద్ర హర్షకు వివా హం ఈ నెల 12న శ్రీకాకుళం ఆనందమయి కన్వెన్షన్ హాల్లో జరగనుంది. తన కుమారుని వివాహానికి హాజరుకావాలని కోరుతూ చంద్రబాబు వద్దకు వెళ్లి సోమవారం ఆహ్వాన పత్రిక రమేష్ అందించారు.

పథకాలు అందక ఆందోళనలో విద్యార్థులు...

- పిల్లలు, వారి తల్లిదండ్రులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోంది...
- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర -హిరమండలం/పాతపట్నం: కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు అందలం ఎక్కించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిబుధవారం పాత పట్నం లోని వైసీపీ కార్యాలయం లో అన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడు చూ చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే ఆలోచన లేదనని ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకాలు అని చెప్పి, సంపద సృష్టిస్తానని ప్రచారం చేసి వాటిపై కనీసం నోరు కూడా మెదపడం లేదని . ఈ కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల కోసం దీక్ష చేశామని, పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నాలు చేశామని, ఇప్పుడు విద్యార్థుల కోసం చంద్రబాబు సర్కారుపై మరో నిరసన గళాన్ని విప్పేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. కళాశాల యాజ మాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలో ఆపేసి పనులకు వెళ్లే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం తక్షణమే తన వైఖరి మార్చుకొని విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం కాదని.. ఆ పథకం పిల్లలు, తల్లులకు పంగనామం అన్నట్లుగా ఉందని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే అందరికీ రూ.15 వేల చొప్పున ఎందరు పిల్లలు ఉంటే.. అంత మందికి ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కళాశాల ఫీజు, హాస్టల్, మెస్ ఫీజులు చెల్లించలేక విద్యార్థులు సతమత మవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉండి ఉంటే.. సక్రమంగా అమ్మఒడి అందేదని, ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యా దీవెనలకు డబ్బులు నేరుగా తల్లుల ఖాతాలలో వేసే వారంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బాహాటంగానే చెప్పుకుంటున్నారన్నారు. జగనన్న పాలనలో విద్యార్థుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారన్నారు. జగనన్న అమ్మఒడి, జగనన్న వసతిదీవెన, జగనన్న విద్యాదీవెన ద్వారా వందల కోట్ల రూపాయలు విద్యార్థుల సంక్షేమం కోసం వ్యయం చేయడం జరిగిందన్నారు. పేద పిల్లలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరో హించాలని గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యతోనే పేదరికం నిర్మూలన అవుతుందని ముందుచూపుతో తల్లిదండ్రులపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. విద్యా, వసతి దీవెన అందించారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలవుతున్నా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఈ పథకం అమలు చేయకుండా ఎగనామం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ రద్దు చేశారన్నారు. ఇంగ్లిష్ మీడియం తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని పథకాల రద్దుతో పేద పిల్లల నాణ్యమైన విద్యకు గండికొడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ స్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకువెళ్తున్నారని పేర్కొన్నారు. మీ పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, గవర్నమెంట్ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంను వ్యతిరేకిస్తూ కోర్టులకు వెళ్లి అడ్డుకున్న తీరును ఇప్పటికీ ప్రజలు మరచిపోలేరని వారిని ఉద్దేశించి అన్నారు. మద్యం సిండికేట్పై ఉన్న ధ్యాస విద్యార్థుల భవిష్యత్తుపై లేదని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దారుణాలను గమనిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలు

విశాలాంధ్ర - టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీలను బుదవారం హైదరాబాదుకు చెందిన డీప్ లూప్ టెక్నాలజీ సిఈఓ సూర్య ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ఆటోమొబైల్ రంగంలో నూతన సాంకేతిక ఆవిష్కరణలు చేసిన వారందరికీ హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. కేవలం పోటీలకు పరిమితం కాకుండా ఆటోమొబైల్ ఆవిష్కరణలను ఉత్పత్తి వైపు తీసుకెళ్లి ఆటోమొబైల్ పరిశ్రమ స్థాపనకు కృషిచేస్తూ గొప్ప వాణిజ్య, వ్యాపార వర్తకులుగా ఎదిగి వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి పోటీలు నిర్వహించిన ఐతమ్కు తమిళనాడు, తెలంగాణా, ఒడిస్సాతో పాటు ఆంధ్రప్రదేశ్కు చెందిన సుదూర ప్రాంతాల నుండి విద్యార్థులు హాజరు కావడం అభినందనీయమన్నారు. ఐతమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఎల్.ఎల్. నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వివి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలను ఐతమ్ యాజమాన్యం రెండవ సారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ప్రతిభను సమాజం దృష్టికి తీసుకువెళ్లడమే ప్రధాన ధ్యేయంగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో గోకార్టింగ్ కన్వీనర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ 16 బృందాలు పాల్గొని వారి ప్రతిభను పరీక్షించుకోనున్నారన్నారు. కో-కన్వీనర్లు డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, ఈసిఈ హెచ్ఐడి డాక్టర్ వి.అశోక్ కుమార్, సిఎస్ ఈ హెచ్ఐడి డాక్టర్ వై. రమేష్, ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘువీర్ దొంటి కురిటి, విద్యార్థి కన్వీనర్లు పి.ఉదయకుమార్, బి.సాయి సాకేత్లు, పలు రాష్ట్రాల నుండి వచ్చిన గోకార్టింగ్ పోటీదారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

311 పశువులకు వ్యాధి నివారణ టీకాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : కోట బొమ్మాళి మండలంలోని కురుడు, యరకయ్యపేట, తర్లిపేట, సూర్యనారాయణపురం, కొప్పలపేట, నరసింగపల్లి, సాలిపేట తదితర గ్రామాలలో బుధవారం 266 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 45 దూడలకు బ్రూసెల్లా వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారులు ఎల్. కిరణ్ కుమార్, ప్రజ్ఞ చైతన్య తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది లక్ష్మీనరసమ్మ, ముకుందరావు, చిరంజీవి, నర్సింహులు, శంకర్ , భాస్కరరావు సేవలందించినట్లు చెప్పారు. ఈ టీకాలు నాలుగు మాసాల దూడల వయసు నుంచి అన్ని వయసు పశువులకు వేసుకోవచ్చని, మూడు మాసాలు లోపల దూడలకి , అనారోగ్య పశువులకు వేయకూడదని, నిండు చూడుతో ఉన్నవాటికి వేయకూడదని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో టెక్కలిపాడు అంగన్వాడీ భవనం

విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు మండలం టెక్కలపాడు గ్రామంలో ఉన్న అంగన్వాడి భవనం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరిందని గ్రామస్తులు తెలిపారు దశాబ్దాల క్రితం ఈ భవనాన్ని నిర్మించారని ఇందులో 35 మంది పిల్లలు గర్భిణీ స్త్రీలు బాలింతలు ఉన్నారని ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామ పెద్దలు ఆందోళన చెందుతున్నారు పిల్లర్స్ తో పాటు స్లాబ్ పై బీట్ల బారడంతో ఏ క్షణాన కూలిపోతుందోనని గ్రామస్తులు వాపోతున్నారు ఎప్పటికైనా అధికారులు పరిశీలించి సారవకోట ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఈ భవనాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి నూతన భవన నిర్మాణానికి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రతీ ఇంటికి కంపోస్ట్ పిట్ నిర్మించాలి

విశాలాంధ్ర - మెలియాపుట్టి : ప్రతీ ఇంటిలో రోజువారీగా వచ్చే చెత్త వేసుకోవడానికి కంపోస్టు పిట్ నిర్మించుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపివో రవి, ఇసి ఆదినారాయణ రెడ్డిలున్నారు. బుధవారం నాడు వారు స్థానిక ఉపాధిహామీ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో సమీక్షించారు. ప్రతీ ఇంటికి కంపోస్ట్ పిట్ త్రవ్వడానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని స్థలమున్న ప్రతీ ఒక్కరు నిర్మించుకోవాలన్నారు. ఇంటిలో నుండి వచ్చిన చెత్తను అందులో వేసుకోవడం వలన చక్కటి ఎరువు తయారు చేసుకోవచ్చని గ్రామాల్లో ప్రతి ఒక్కరికి క్షేత్రసహాయకులు అవగాహన కల్పించాలన్నారు. వీరితో పాటుగా ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు గుట్టుగా కొట్టేశారు

- పట్టణంలో పాగా వేసిన వైద్యులు
- భారీ మొత్తానికి విక్రయాలు

విశాలాంధ్ర - ఆమదాలవలస : పట్టణానికి గుండెకాయ లాంటి పురాతన భవనాన్ని ఎట్టకేలకు కూల్చారు. కొంతకాలంగా వివాదాల్లో ఉండ డంతో గుట్టుగా రాత్రి వేళల్లో మున్సిపల్ అధికారుల కు సమాచారం ఇవ్వకుండానే ఆదర బాదర గా కూల్చేశారు. పట్టణం ప్రధాన కూడలి వద్ద జిల్లాకు చెందిన కొందరు వైద్యులు ఆ భవనాలను కొనుగోలు చేసి కొంత మంది మారు విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొంతమంది స్థానిక నాయకుల అండతో కన్వె న్షన్ సెంటర్లు టింకిల్ స్కూల్స్ వంటివి నిర్మించి వ్యాపా రాలు చేస్తున్నారు. ప్రధాన రహదానికి ఆనుకుని ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేసి ఆ స్థలాలకు అత్యధి క ధరలు పనికిస్తున్నారు. రైల్వే స్టేషన్కు ఆపోజిట్ లో ఉన్న పురాతన భవనం దేవి విలాస్ ను సోమవారం రాత్రి తొలగించారు. గత కొన్నిళ్ళుగా పురాతన భవ నాల్లో వ్యక్తులు వ్యాపారాలు చేసుకుంటూ జీవించే వారు. పార్వతీపురానికి చెందిన ఆ భవన యజమాని ఆ వ్యాపారులను తొలగించలేని పరిస్థితి నెలకొనడం తో శ్రీకాకుళంలోని వైద్యులకు సుమారు ఏడుకోట్లా ఎనభై లక్షలకు విక్రయించి అక్కడ ఉన్న వ్యాపారుల వివాదాలను కూడా పరిష్కరించుకోవాలని అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. దీంతో ఆ వైద్యుడు ఆయన వద్ద పనిచేసే వ్యక్తి ద్వారా రాజకీయ నాయకుల అండతో వారికి కొంత మొత్తాలను అందజేసి వ్యాపారాలు ఖాళీ చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అప్పటికే ఆ పురాతన భవనంపై పలుమార్లు మున్సిపల్ అధి కారులు తొలగించాలని నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులు ఆధారంగా అర్ధరాత్రి భవనాన్ని కూల్చివే శారు. రాత్రి వరకు ఉన్న భవనం తెల్లవారి సరికి లేక పోవడంతో స్థానికులు కూడా ఒక ఎంత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కేవలం అందులో ఉన్న వ్యాపారులను ఖాళీ చేయించాలన్న ఉద్దేశంతోనే రాత్రికి రాత్రి ఈ పని చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. చుట్టూ భవ నాలు ఉన్నప్పటికీ కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా భవనాన్ని తొలగించడంపై మునిసిపల్ అధికారులకు చేతులు తడిపినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

పట్టణంలో బాగా వేసిన వైద్యులు... ఆమదాలవలస పట్టణ పరిధిలో శ్రీకాకుళానికి చెందిన కొంతమంది వైద్యులు పాగా వేసేందుకు వారికి అను కూలంగా అధిక ధరలకు స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్ర రైల్వే స్టేషన్ ఉండటంతో ఇక్కడ వ్యాపారాలు అధిక లాభాలు అందిస్తాయి అన్న ఉద్దే శంతో లక్షల్లో ఉన్న భూములకు కోట్ల రూపాయలు ధర పలికించడంతో స్థానికులు వాటిని విక్రయించేందుకు మొగ్గుచూపుతున్నారు. రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఈ పురాతన భవనాన్ని ఏడు కోట్ల 80 లక్షలకు కొను గోలు చేసి సుమారు 15 కోట్లకు విక్రయించేందుకు మార్గదర్శకాలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ తరుణంలోనే వాటిలో వ్యాపారం చేసుకునేవారు శశా మీరా అన్నారు. వీరి బాదన తొలగించు కునేందుకు అర్ధరాత్రి ఎటువంటి భద్రతా చర్యలు చేపట్టకుండా భవనాన్ని తొలగించారు. అలాగే పోలీస్ స్టేషన్ ఎదు రుగా ఉన్న స్థలాన్ని మరో వైద్యుడు కొనుగోలు చేసి స్థానిక నాయకుల అండతో కనీస పార్కింగ్ లు కూడా ఉంచకుండా కన్వెన్షన్ హాల్ నిర్మించి వ్యాపార లావా దేవీలు కొనసాగిస్తున్నారు. దీనిపై పురపాలక సంఘ పట్టణ ప్రణాళిక విభాగం మత్తులో జోగుతున్నట్లు తెలుస్తోంది. సీఎస్పీ రోడ్డు కానుకొని ఒకటింకిల్స్ స్కూల్ నిర్మాణం చేపట్టారు. దానిలో కూడా వైద్యుడే ప్రధాన పాత్రధారి. ఇలా పట్టణానికి ప్రధాన రహదారికి అనుకొని ఉన్న స్థలాలను కొనుగోలు చేసి వీరి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

భారీ మొత్తాల కు విక్రయాలు... ఖాళీగా ఉన్న స్థలాల్లో వైద్యుల పాగా వేసి వాటిని భారీ మొత్తాల కు విక్రయాలు చేస్తూ వ్యాపారాలు కొనసా గిస్తున్నారు. లక్షల్లో ఉన్న భూములను కోట్ల రూపా యలకు క్రయ విక్రయాలు చేయటంతో స్థానికులు కూడా వారి వైపే ఆశగా చూస్తున్నారు. పురాతన భవనం దేవి విలాస్ బొడ్డేపల్లి కుటుంబం రాజకీయ పరిణామాలు అన్ని దీని కేంద్రంగానే జరిగాయి. సమి తు లనాటి కాలం నుంచి గ్రామ పట్టణ రాజకీయాలు దేవి విలాస్ కేంద్రంగానే జరిగాయని కొందరు చెబుతు న్నారు. అటువంటి భవనాన్ని ఎటువంటి భద్రతా చర్య లు పాటించకుండా కూల్చివేతకు చర్యలు చేపట్టడం వెనుక స్థానిక నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఎటువంటి ప్రమాదము సంభవించలేదు కనుక వారి చర్యలు మంచివే కావచ్చు కానీ ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు అనే ప్రశ్న మునిసిపల్ అధికారులు వేసుకోవలసి ఉంటుంది. దీనిపై మున్సిపల్ అధికా రుల తీరు పలువురు పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు.